# కీర్తికాముడు

"**కా**ముడు, కీర్తికాముడు" అని ఏనాడో ఎవరో జోక్ చేశారు.

కీర్తికాముకుడికి ఎన్ని రంగాలైనా ఉన్నాయి. నటుడు, సినీనటుడు, గాయకుడు, ప్లేబాక్ గాయకుడు, సర్కస్ క్లోన్, ప్లాట్‌ఫాం ఉపన్యాసకుడు, వ్యాయామ క్రీడాకారుడు (టెన్నిస్, ఫుట్‌బాల్, క్రికెట్) – ఇలాటివాటిలో కీర్తి తెచ్చుకోవాలని కాముడికి లేదు.

వాడు చిన్నతనం నుంచీ పత్రికల పురుగు కావటంచేత, తరచు పత్రికలతో కనిపించే కొద్దిపేర్లు చూసి అమితంగా అసూయపడిపోయేవాడు. ఒక్కో నెల ఒకే పేరు మూడు, నాలుగు మాసపత్రికలలో! ఏం కీర్తి! ఇంకో పదేళ్లకి, పదిహేనేళ్లకి తాను కూడా ఆ స్థాయికి రావాలని వాడు తపస్సు చేశాడు.

ఈ లోపల వాడు సాహిత్యోద్యమాలూ, అభ్యుదయ రచయితలు కొట్టేస్తున్న ఖ్యాతీ గమనించాడు. తనకు రాసే అర్హత వచ్చిందనిపించగానే రచనలు ప్రారంభించాడు. వాడి స్నేహితులు వాణ్ని 'బిచ్చగాళ్ల' రచయిత అని పిలవసాగారు. అభ్యుదయం బిచ్చగాళ్ల జీవితంనుంచే రావాలని వాడికేదో ఏర్పడిపోయింది.

ఏమైనప్పటికీ పేరుగల పత్రికలు ఏవీ వాడి రచనలు వెయ్యలేదు. 'అభ్యుదయ' ధోరణి గల పత్రికలు కొద్ది రచనలు వేశాయి. వాడి రచనలు కొందరు కమ్యూనిస్టులను ఆకర్షించాయి. వాళ్లు వాడికి ఏం రాయాలో, ఎట్లా రాయాలో చెప్పసాగారు. వాడి సంస్కృతి వామపక్ష సంస్కృతి అని వాళ్లు అపోహపడ్డారు. కాని అలాటివాళ్ల మెప్పు వాడికి అక్కర్లేదు. గురజాడనూ, కందుకూరినీ, చిలకమర్తినీ మెచ్చుకొంటున్నది ఇంతకన్న మంచి సాహితీపరులని వాడి నమ్మకం.

"బాబాయ్, నేను రచయితగా పైకి రాలేనా" అని కాముడు నన్ను అడిగాడు.

"ఒరే, నువు దరిద్రులకోసం రాస్తే బ్రహ్మరథం పట్టేదెవరు? ఎంత రియాక్షనరీగా రాస్తే అంత పేరు వస్తుంది. నిన్ను మెచ్చుకునేవాళ్లు కొద్దిమందే కావచ్చు, తిట్టేవాళ్లు వేల సంఖ్యలో ఉండొచ్చు కాని నువు రాజు పూజితుడివీ, అందలం ఎక్కినవాడివీ కావాలంటే అదే మార్గాం" అన్నాను.

నా సలహా ప్రకారం నడుచుకుని కాముడు వచన సమ్రాట్ అయాడు. వందలకొద్దీ సన్మానాలు పొందుతున్నాడు. శుభం!

***ముద్రణ : యువ, మే 1977***